నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
10 | మహబూబ్‌నగర్, బుధవారం 22 జనవరి 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

మాదిగలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వరా..?

అమ్రాబాద్, జనవరి 21: పదర మండలంలోని ఉడిమిళ్లలో తమకు ఇందిరమ్మ ఇండ్లు రాలేదని మాదిగలు అధికారులను నిలదీశారు. గ్రామంలో 300లకు పైగా మాదిగ వర్గానికి చెందిన వారు ఉన్నారని ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకుంటే ఒక్క ఇల్లు కూడా మాదిగలకు ఇవ్వలేదని ఆరోపించారు. అచ్చంపేట నియోజకవర్గానికి మాల కమ్యూనిటీకి చెందిన ఎమ్మెల్యే వంశీకృష్ణ ఉండడంతో కేవలం ఎస్సీ మాలలకు మాత్రమే ఇండ్లను మంజూరు చేశారని, మాదిగలు ఇందిరమ్మ ఇండ్లకు అర్హులు కారా..? అని అధికారులను ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి మాతృ, డీటీ బీస్వనాయక్ మాదిగలకు తెలిపారు.

లబ్ధిదారుల వివరాలను చూపుతున్న అధికారులు

ఇవేం గ్రామసభలురా.. బాబు..!

- పెదవి విరుస్తున్న కాంగ్రెస్ నాయకులు

గద్వాలటౌన్, జనవరి 21: ఇవేం గ్రామ సభలురా బాబు.. సీఎం రేవంత్ రెడ్డి ఈ సభలు ఎందుకు పెట్టాడో.. ఈ ప్రభుత్వం ఏం చేస్తుందో అర్థం కావడం లేదు. ప్రశ్నలు వేసే ప్రజలకు సమాధానాలు చెప్పలేక పోతున్నాం.. ఇదేం కర్మరా నాయనా అంటూ కాంగ్రెస్ కౌన్సిలర్లు.. నాయకులు ప్రభుత్వ తీరుపై పెదవి విరుస్తున్నారు. మంగళవారం గద్వాల మున్సిపాలిటీలోని 8వార్డుల్లో సభలు నిర్వహించారు. మిగిలిన మూడు రోజుల పాటు రోజుకు పదివార్డుల చొప్పున ఎంపిక చేసి సభలు నిర్వహిస్తారు. అయితే సభలో కేవలం ప్రజల నుంచి దరఖాస్తులు మాత్రమే స్వీకరిస్తున్నారు. ప్రజల నుంచి అసహనం వ్యక్తమవుతున్నది. ఎన్నిసార్లు దరఖాస్తులు తీసుకుంటారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తులు పని రాకవా.. ఈ దరఖాస్తు ఎప్పుడు పనికి వస్తాయా మూలన పడేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు తలలు పట్టుకుంటున్నారు.


వడ్డేపల్లి మండలం జిల్లెడుదిన్నెలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

గ్రామసభ బహిష్కరణ

- ఇష్టారాజ్యంగా జాబితా ఉందంటూ ఆరోపణ
- అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్న జిల్లెడుదిన్నె ప్రజలు
- మధ్యాహ్నం 2గంటలకు మళ్లీ గ్రామసభ మొదలు

వడ్డేపల్లి, జనవరి 21 : మండంలోని జిల్లెడదిన్నెలో పంచాయతీ కార్యదర్శి అశోక్ ఇష్టారాజ్యంగా అర్హుల జాబితా తయారు చేశాడని గ్రామసభకు కుర్చీలు, టెంటు, కనీస సౌకర్యాలు లేకుండా సభను నిర్వహించడంపై అసహనం చెందిన గ్రామస్తులు గ్రామసభను బహిష్కరించి ఇండ్లకు వెళ్లి పోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు ఎంపికైన జాబితాను గ్రామసభలో వెల్లడించడానికి ఏర్పాటు చేయగా.. గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులకు ఎంపికైన వారి జాబితాలో అందరికీ ఆమోదయోగ్యంగా లేవని, ఒక్కరికి మూడు రేషన్‌కార్డులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దరఖాస్తులు తీసుకోవడం, సర్వే చేయడం తప్పా ప్రభుత్వం ఏం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రజలు గ్రామసభను బహిష్కరించారు. జీపీ కార్యదర్శి పంచాయతీ కార్యాలయంలో ఒక పెద్ద గదిని ఆర్డీఎస్ వారికి ఎలా ఇచ్చారని, గదికి తాళం ఎందుకు వేశారని ప్రశ్నించారు. ఆత్మీయ భరోసా 60, రేషన్ కార్డులు 35, ఇందిరమ్మ ఇండ్లు 147 దరఖాస్తులు వచ్చాయని చెప్పడంతో ఇష్టారాజ్యంగా ఎంపిక చేశారని, అర్హుల జాబితాలో జీపీ కార్యదర్శి నిర్లక్ష్యం వహించాడని, వ్యవసాయేతర భూమి గుర్తింపు తప్పుల తడకగా ఉందని, ఇండ్లు లేని వారికి ఇండ్లు ఇవ్వాలని, గ్రామసభను తూతూమంత్రంగా ముగించడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అధికారులను నిలదీశారు. ఇంతలో ఎంపీడీవో రామకృష్ణ కలుగజేసుకొని ప్రజలకు కుర్చీలు, టెంటు వేయాలని సూచించామని తప్పిదం జరిగిందని కాస్త టైం ఇస్తే అన్ని ఏర్పాటు చేస్తామని సర్దిచెప్పారు. ఎట్టకేలకు మధ్యాహ్నం గ్రామసభను మళ్లీ నిర్వహించారు.

నవాబ్‌పేట మండలం యన్మన్‌గండ్లలో అధికారులను చుట్టుముట్టిన గ్రామస్తులు

కొల్లూరు గ్రామసభ రసాభాస

- ఇప్పటూర్‌లో వడ్ల బోనస్‌పై నిలదీత

నవాబ్‌పేట, జనవరి 21: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గ్రామసభలు గందరగోళంగా మారాయి. కొల్లూరులో గ్రామసభ రసాభాసగా మారింది. గ్రామసభ ప్రారంభంలో పంచాయతీ కార్మికుడు యాదయ్య గ్రామసభకు హాజరైన ప్రజల వద్ద రిజిస్టర్‌లో సంతకాలు సేకరిస్తుండగా.. అదే గ్రామానికి చెందిన రామయ్య చేయి చేసు కోవడంతో తీవ్ర వాగ్వాదం చేటు చేసుకున్నది. అనంతరం గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి వివిధ పథకాల లబ్ధిదారుల జాబితా చదువుతుండగా...గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి స్పందిస్తూ.. నిజమైన లబ్ధిదారుల పేర్లు జాబితాలో లేవని నిలదీయడంతో అధికార పార్టీ నాయకుడు కలుగజేసుకోవడంతో రసాభాసగా మారింది. ఇప్పటూర్‌లో చాలామంది రైతులు తాము అమ్మిన వరి ధాన్యానికి నేటికీ బోనస్ ఎందుకు రాలేదని అధికారులను నిలదీశారు. కూచూర్‌లో ఆత్మీయ భరోసా జాబితాను అధికారి చదువుతుండగా.. కొంతమంది నిరుపేదలు అభ్యంతరం తెలిపారు. యన్మన్‌గండ్లలో నిరుపేదలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. హజిలా పుల్, లింగంపల్లి, కోళ్లగుట్టతండా, చాకలిపల్లిలో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయరామ్‌నాయక్, తాసీల్దార్ శ్రీనివాస్, డీటీ గాయత్రి, ఆర్ఐ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలకు ప్రాతినిధ్యం వహించేదెవరు?

మందిపల్లి సభలో వేదికపై కూర్చున్న కాంగ్రెస్ నేతలు

మాగనూరు, జనవరి 21: గ్రామసభలకు ప్రాతినిధ్యం వహించేది అధికారులా, ప్రజాప్రతినిధులా? లేక అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులా అర్థం కావడంలేదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎల్లారెడ్డి మండిపడ్డారు. మంగళవారం మండలంలోని మందిపల్లి గ్రామసభ వేదికపై, కృష్ణా మండలంలోని చేగుంట గ్రామసభలో ప్రజాప్రతినిధులు, అధికారులు కాకుండా కాంగ్రెస్ నాయకులు కూర్చోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కూర్చోవాల్సిన చోట కాంగ్రెస్ నాయకులు కూర్చొని వారి గౌరవాన్ని అపహస్యం చేయొద్దని కోరారు. ప్రజాపాలనంటే అధికారులు, ప్రజాప్రతినిధులని.. ఇలా అధికార పార్టీ నాయకులకు స్టేజీపై అవకాశం ఇవ్వకూడదన్నారు.

- గ్రామ సభలు బహిష్కరణ
- నిలదీతలు, అడ్డగింతలతో ఆందోళనలు
- రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు ఆత్మీయ భరోసా లిస్టులు ఎవరు ఇచ్చారని ప్రశ్నల వర్షం
- గ్రామసభల్లో స్వీకరిస్తామని అధికారుల దాటవేత
- నవాబ్ పేట మండలంలో పంచాయతీ వర్కర్‌పై దాడి
- రాకొండలో పోలీస్ పహారాలో గ్రామసభ
- ఉమ్మడి జిల్లాలో తొలిరోజు ఉద్రిక్త వాతావరణం
- గ్యారెంటీలన్నీ కాంగ్రెస్ కార్యకర్తలకే.. : నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు


పాన్‌గల్ మండలం అన్నారంలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

మాకు గ్యారెంటీలేవీ..?

మహబూబ్‌నగర్, జనవరి21(నమస్తే తెలంగాణ ప్రతినిధి): రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా అమలు చేసేందుకు అధికారులు తయారు చేసిన నివేదిక తప్పులతడకగా మారడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గ్రామసభలు రసాభాసగా మారాయి. ఎక్కడికక్కడ గ్రామస్తుల నిలదీతలతో కొనసాగింది. కొన్ని చోట్ల ప్రజలు ఈ కార్యక్రమాన్ని బహిష్కరించారు. మరి కొన్ని చోట్ల పోలీసు బందోబస్తు మధ్య గ్రామసభలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దాదాపు 13నెలల తర్వాత ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెబుతూ ఈనెల 26 నుంచి శ్రీకారం చుట్టనుండడంతో.. గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సభలోని లబ్ధిదారుల ఎంపిక చేస్తామని చెప్పినప్పటికీ గతంలో ప్రజాపాలనలో భాగంగా ఇంటింటి సర్వేలో వివరాలు సేకరించారు. అరకొర వివరాలతో ఇప్పటికే లబ్ధిదారుల జాబితా సిద్ధం చేశారు. ఈ జాబితాలను గ్రామసభల్లో ఆమోదింపజేసేందుకు అధికార యంత్రాంగం చేస్తున్న ప్రయత్నం విఫలమవుతున్నది. మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు కొనసాగుతున్న గ్రామసభల నిర్వహణ ఉద్రిక్తతకు దారితీస్తోంది. ఉమ్మడి జిల్లాలో గ్రామసభలు ఆందోళనలు.. నిలదీతల మధ్య కొనసాగాయి. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. గ్యారెంటీన్నీ కాంగ్రెస్ కార్యకర్తలకే.. అంటూ కార్యకర్తలు అధైర్య పడొద్దని తాము సంతకం పెడితేనే కలెక్టర్లు లబ్ధిదారులను ఎంపిక చేస్తారని అభయ విస్తారు. నవాబ్‌పేట మండలంలో పంచాయతీ సిబ్బందిపై గ్రామస్తులు దాడి చేశారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రసాభాస

మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం వెంకటాపూర్‌పల్లిలో ఆత్మీయ భరోసా కింద అసలైన లబ్ధిదారులకు దక్కలేదంటూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు ఎదుట ఆందోళనకు దిగారు. నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో అర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదంటూ గ్రామసభను అడ్డుకున్నారు. కృష్ణ మండల కేంద్రంలో రేషన్ కార్డుల జాబితాలో తమ పేర్లు రాలేదంటూ మహిళలు నిలదీశారు. కొత్త దరఖాస్తులు తీసుకొని గ్రామసభ ముగించారు. జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం జిల్లెడుదిన్నెలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో గ్రామసభను బహిష్కరించారు. తర్వాత టెంట్లు వేశాక నిర్వహించారు. గ్రామంలో ఒకే వ్యక్తికి మూడు రేషన్ కార్డులు మంజూరు చేశారంటూ గ్రామ కార్యదర్శిపై ఫిర్యాదు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం ఉడిమిళ్లలో చెంచులకు ప్రాధాన్యం ఇవ్వలేదని అధికారులను నిలదీశారు. జడ్చర్ల మండలం వెలుగొమ్ములలో రైతు రుణమాఫీ రాలేదంటూ ఆందోళన చేశారు. వనపర్తి జిల్లా పానగల్ మండలం అన్నారంలో ఇందిరమ్మ ఇల్లు కాంగ్రెస్ కార్యకర్తలకు పంచుతున్నారంటూ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. నవాబ్‌పేట మండలం కొల్లూరులో గ్రామసభ జరుగుతుండగా.. లబ్ధిదారులు అధికారులను నిలదీశారు. అక్కడ కాంగ్రెస్ నాయకులు కలగజేసుకొని మాట్లాడడంతో లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. అదే గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు యాదయ్యపై చేయి చేసుకున్నారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండలంలో కూడా గ్రామసభలు రసాభాసగా మారాయి.

ఇందిరమ్మ ఇండ్లపై గందరగోళం

పాన్‌గల్, జనవరి 21: మండలంలోని అన్నారంలో నిర్వహించిన గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్ల విషయంలో గ్రామస్తులు గందరగోళం సృష్టించారు. గ్రామసభలో ప్రత్యేకాధికారి డాక్టర్ సురేశ్ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, రైతు ఆత్మీయ భరోసా వంటి సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పేర్లు చదివి వినిస్తుండగా పేర్లురాని వారు అడ్డు తగిలారు. సభలో ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్లపై చర్చ జరిగింది. అర్హత ఉన్న తమకు ఎందుకు లబ్ధిదారుల జాబితాలో చేర్చలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తలకే జాబితాలో అవకాశం కల్పిస్తారా? అని గ్రామస్తులు ప్రశ్నించారు. తప్పులతడకగా ఉన్న జాబితాలో అనర్హులను తొలగించి అర్హులకు అవకాశం కల్పించాలని అరగంట పాటు అధికారులతో వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ నాయకులు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను చింపివేసి గ్రామసభను బహిష్కరించారు.

హామీల అమలుపై తిరుగుబాటు


అమరచింత : ఈర్లదిన్నెలో రుణమాఫీపై అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

అమరచింత, జనవరి 21: మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ నూరుజీజీ, మండలంలోని చింతరెడ్డిపల్లి, ఈర్లదిన్నె, ధర్మాపూర్‌లో డీపీవో సురేశ్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీవో నర్సింహయ్య ఆధ్వర్యంలో నిర్వహించి గ్రామసభల్లో సంక్షేమ పథకల అందజేతకు అనర్హుల పేర్లను ఎంపిక చేశారని ఆయా గ్రామాల, వార్డుల్లో అధికారులను నిలదీశారు. అర్హుల జాబితాలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు తమకు ఇష్టవైన వారిని ఎంపిక చేశారని అధికారులను నిలదీశారు. ఈర్లదిన్నె గ్రామసభలో రైతు శివారెడ్డి తాను రూ. లక్షా 60వేలు క్రాప్‌లోన్ తీసుకున్నా మాఫీ వర్తించలేదని గ్రామసభలో అధికారులను నిలదీయగా.. చాలా మంది రైతులు మద్దతు తెలిపి అధికారులతో వాధించారు.

రుణమాఫీపై నిలదీసిన రైతులు

మిడ్జిల్, జనవరి 21: మండలంలోని వెలుగోముల, వేముల, దోనూర్, బైరంపల్లి, సింగందొడ్డిలో గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభల్లో ప్రజలు, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్, తాసీల్దార్ రాజు, ఎంపీడీవో గీతాంజలి, ఏవో సిద్ధార్థ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులు పక్కా సమాచారంతో రావాలి

పెద్దదిన్నెలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

ఇటిక్యాల, జనవరి 21: ప్రభుత్వ పథకాలకు అర్హులైన పేదలను గుర్తించేందుకు అధికారులు స్పష్టమైన సమాచారంతో గ్రామసభలను నిర్వహించాలని పెద్దదిన్నె గ్రామస్తులు గ్రామసభ నిర్వహించడానికి వచ్చిన అధికారులను నిలదీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసేం దుకు మండలంలో పెద్దదిన్నె, చాగాపురం, సాతర్ల, మండల కేంద్రంలో మంగళవారం గ్రామభలను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దదిన్నెలో నిర్వహించిన గ్రామసభలో లబ్ధిపొందుతున్న వారికే మళ్లీ లబ్ధి చేకూరేలా జాబితా ఉందని, ఎకరాలు భూమి ఉన్నవారికి గ్రామంలో రేషన్ కార్డులు ఉన్నాయని పేదలు దరఖాస్తున్న చేసు కొన్న వారి పేర్లు ప్రస్తుత జాబితాలో లేవని అధికారులపై మండిపడ్డారు. ఇటిక్యాలలో జేసీ లక్ష్మీనారాయణ పాల్గొని పథకాల అమలుపై అపోహలను నివృత్తి చేశారు.

రంగాపూర్, కోనేటిపూర్‌లో..

వంగూరు, జనవరి 21: మండలంలోని వంగూరు, కొండారెడ్డిపల్లి, కోనేటిపూర్, రంగాపూర్‌లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. కొండారెడ్డిపల్లి గ్రామసభకు ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరై మాట్లాడారు. రంగాపుల్‌లో కాంగ్రెస్‌లోనే ఓ వర్గం ప్రభుత్వానికి అనుకూలంగా, మరోవర్గం వ్యతిరేకంగా అధికారులపై విరుచుకుపడ్డారు. కోనేటిపూర్‌లో 9 ఇండ్లు మంజూరు కాగా వారిలో గ్రామంలో లేని వారితోపాటు ఇల్లున్న కాంగ్రెస్ వారికి మంజూరు కావడంతో గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాకొండలో గ్రామసభను అడ్డుకున్న గ్రామస్తులు

రాకొండలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

మరికల్, జనవరి 21 : మండలంలో మంగళవారం పల్లెగడ్డ, తీలేరు, రాకొండ, మరికల్‌లో గ్రామసభలు నిర్వహించారు. మరికల్‌లో జరిగిన గ్రామసభలో గ్రామస్తులు మాట్లాడుతూ.. ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ నాయకులే ఎట్లా ఉంటారని ప్రశ్నించారు. ఇష్టానుసారంగా ఇందిరమ్మ కమిటీలను ఎన్నుకోవడం తగదన్నారు. పల్లెగడ్డ, తీలేరులో గ్రామసభ సాఫీగా సాగింది. రాకొండలో అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు రాలేదని, ఒకే కుటుంబంలోని వారికి రెండు, మూడు ఇండ్లు వచ్చాయని గ్రామస్తులు, మహిళలు ఆందోళన చేశారు. అర్హులకు రాని ఇండ్లతో ఈ గ్రామసభలను ఎందుకు నిర్వహిస్తారని, గ్రామసభను అడ్డుకోవడంతో మరికల్ ఎస్సై రాము గ్రామానికి చేరుకొని పోలీసు పహారా మధ్య గ్రామసభను జరిపించారు.

అధికారులను చుట్టుముట్టిన ప్రజలు

వేపూర్‌లో అధికారుల చుట్టుముట్టిన ప్రజలు

హన్వాడ, జనవరి 21: మండలంలోని వేపూర్, దాచకిపల్లి, టంకర, గొండ్యాల, కొనగట్టుపల్లితో పాటు వివిధ గ్రామాల్లో గ్రామసభ నిర్వహించారు. వేపూర్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆనంద్ మాట్లాడుతూ.. రైతుభరోసా 5ఎకరాలా, 10ఎకరాలకు ఇస్తారో రైతులకు ముందుగా చెప్పాలని అధికారులను నిలదీశారు. టంకర, గొండ్యాల, కొనగట్టుపల్లి, ఇబ్రహీం బాద్‌లో ప్రతిఒక్కరికీ రేషన్‌కార్డులు అందించాలని, రైతు భరోసా ఇవ్వాలని అధికారుల దృష్టి తీసుకెళ్లారు. వేపూర్, దాచకిపల్లి గ్రామస్తులు రేషన్‌కార్డుల కోసం అధికారులను చుట్టుముట్టారు. ఇబ్రహీంబాద్, టంకరలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనితరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధనియాప్‌తో రూ.4కోట్ల మోసం

- ముగ్గురు నిందితుల పట్టివేత
- వివరాలు వెల్లడించిన ఎస్పీ గిరిధర్

వనపర్తి టౌన్, జనవరి 21: ధని యాప్ పేరుతో సైబర్ నేరాలకు పాల్పడుతూ రూ.4 కోట్లు ఖాజేసిన సైబర్ నేరగాళ్లను పట్టుకున్నట్లు సైబర్ క్రైం డీఎస్పీ రత్నం తెలిపారు. మంగళవారం సీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. నకిలీ ధని యాప్‌తో మొత్తం 35 మంది సైబర్ నేరగాళ్లు నేరాలకు పాల్పడుతున్నారని, అందులో సుమారుగా రూ.4కోట్లు ఖాజేసిన ఘటన తెలిసిందేన్నారు. ఎలాంటి కష్టం లేకుండా సులభమైన పద్ధతిలో డబ్బు సంపాదించాలనే దురాశతో ధని లోన్ యాప్ ద్వారా అమాయకులను నిలువు దోపిడీకి గురిచేశలన్నారు. లోన్ మంజూరైందని, ప్రాసెసింగ్ ఫీజుల పేరుతో రూ.4కోట్లకు పైగా వసూలు చేసి మోసగించారన్నారు. గోపాలపేట మండలం పాలిహేడ్‌కు చెందిన కావలి శివుడుకు లోన్ కావాలా అని ఫోన్ రాగా.. ధని యాప్ ద్వారా లోన్ అందిస్తామని చెప్పారన్నారు. తన బావమరిదికి అవసరమున్నదని శివుడు చెప్పగా.. అదే గ్రామానికి చెందిన వెంకటేశ్ లోన్ కోసం వారు అడిగిన వివరాలన్ని చెప్పారని చెప్పారు. ప్రాసెసింగ్ ఫీజు ప్రకారం క్యూఆర్ కోడ్‌కు ఫోన్‌పే ద్వారా మొదటగా రూ.5,250 తర్వాత రూ.5వేలు తర్వాత రూ.2250 మరోసారి రూ.9,435 అలా మొత్తం రూ. 32,135 పంపగా ఫిర్యాదుదారుడికి అనుమానం వచ్చి సైబర్ పోర్టల్ 1930కి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని వెల్లడించారని చెప్పారు. గోపాలపేట పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సైబర్ యాక్ట్‌పై కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. సైబర్ బ్యూరో డైరెక్టర్ షీకా గోయేల్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. మొత్తం సైబర్ నేరగాళ్లను గుర్తించి ఈనెల 20న ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద నుంచి దాదాపు రూ. 30లక్షల బ్రెజా కారు, జేసీబీ, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో మహబూబ్‌నగర్ మూసాపేట మండలానికి చెందిన ఎం. నరేశ్‌నాయక్, చందూనాయక్, వెంకటేశ్‌నాయక్‌ను అరెస్ట్ చేసి విచారించగా.. ఇప్పటివరకు కలకత్తా, ఢిల్లీ, పాట్నాలో ఉంటూ అంకిత్, ఫంకజ్ సహచరులు చెప్పినట్లు సైబర్ నేరాలకు పాల్పడుతూ డబ్బులు సంపాదించాలరన్నారు. సమావేశంలో సీఐ కృష్ణ, గోపాలపేట ఎస్సై నరేశ్, కానిస్టేబుళ్లు ఉన్నారన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

సైబర్‌నేరాలపై అవగాహన ఉండాలి

విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన ఉంటూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. మంగళవారం వనపర్తి మహిళా డిగ్రీ కళాశాలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపార్టుమెంట్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు, ప్రాజెక్టు మేనేజర్ అశోక్‌కుమార్, డీపీఎంవో బాషానాయక్ తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్ మోసానికి గురైన వ్యక్తి

అలంపూర్, జనవరి 21: ఆన్‌లైన్ మోసానికి గురైన వ్యక్తి న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. బుక్కాపురం గ్రామానికి చెందిన విష్ణు 4వ తేదీన తన వాట్సాప్‌కి ఈ ఫాం, పిల్ చేయాలని ఒక టెలిగ్రాం లింక్ రాగా.. అతను లింకులో జాయిన్ అయితే క్యూకో అనే గ్రూపులో జాయిన్ అయ్యాడు. లింకులో ఉన్న గుర్తు తెలియని వ్యక్తులు రూ.వెయ్యి పెట్టుబడి పెడితే రూ.1300 లాభం వస్తుందని చెప్పగా.. వెయ్యి పెట్టుబడి పెట్టగా.. రూ. 1300 పంపారు. తర్వాత బాధితుడు రూ.3వేలు, రూ.4వేలు పెట్టుబడి పెట్టాడు.. కాని నగదు రిటర్న్ రాలేదు. మీరు ఇంకా కొన్ని డబ్బులు వేస్తే ఇస్తామని నమ్మించారు. ఇదేవిధంగా అతనితో మొత్తం రూ. 8,67,000 వేశాడు. తర్వాత ఇది ఫేక్ ఇన్వెస్ట్ మెంట్ అని తెలుసుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మార్కెట్లోకి హ్యుందాయ్ ఎలక్ట్రిక్ కారు

- ప్రారంభించిన డీటీసీ కిషన్

మహబూబ్‌నగర్, జనవరి 21: మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలోని సరికొత్త హంగులతో అత్యాధునిక వసతులతో నూతనంగా హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్ కారును ఉమ్మడి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కిషన్ ప్రారంభించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అప్పన్నపల్లిలో ఉన్న ట్రెండ్ హ్యుందాయ్ షోరూంలో ముఖ్యఅతిథిగా హాజరై క్రెటా ఎలక్ట్రిక్ కారును మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ డైరెక్టర్ గట్టు సిరి చందనరెడ్డి మాట్లాడుతూ.. హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్ కారులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సరికొత్త 42కేడబ్ల్యూహెచ్, 51.4 కేడబ్ల్యూహెచ్ గల అల్టిమేట్ బ్యాటరీతో భద్రతా సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కసారి చార్జింగ్ పెడితే 473 కిలోమీటర్లు మైలేజ్ వస్తుందని, బ్యాటరీ 10శాతం నుంచి 80శాతం వరకు 58 నిమిషాల్లో (50 కేడబ్ల్యూ) 39 నిమిషాల్లో (100 కేడబ్ల్యూ) డీసీ చార్జింగ్ అవుతుందన్నారు. కేవలం 7.9 సెక్లన్లలో సున్నా నుంచి 100కిలో మీటర్ల వేగానికి చేరుకుంటుందని తెలిపారు. వీ 2ఎల్ (వెహికల్ టు లోడ్) ఫీచర్ బ్యాటరీతోపాటు సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ చార్జింగ్ చేసుకోవచ్చని చెప్పారు. 17 ఇంచ్ ఏరో అల్లాయ్ వీల్స్ లెవల్- 2 అడ్వాన్స్, అడ్వాన్స్ డ్రైవర్ ఆసిస్టెంట్ సిస్టమ్, 70 ప్లస్ స్టాండర్డ్ సేఫ్టీ ఫ్యూచర్స్, కూల్డ్ స్టోరేజ్, సన్ రూఫ్, డ్యూయల్ టోన్ రంగుల్లో లభిస్తుందని, ఈ కారు ప్రారంభ ధర రూ. 17.99 లక్షల నుంచి 23.50 లక్షల ధరతో లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ రఘుకుమార్, సేల్స్ మేనేజర్ హర్షవర్ధన్‌రెడ్డి, సర్వీస్ మేనేజర్ మహమ్మద్ వసీమ్, కస్టమర్లు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ కారును ప్రారంభిస్తున్న డీటీసీ కిషన్